సాక్షి శ్రీకాకుళం

ఆదివారం | 16 | ఏప్రిల్ | 2023



శాంత స్వరూపిణి..స్వేచ్ఛావతి

ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి సంబరాలు 17 నుంచి మొదలవుతున్నాయి. ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- 8లో



వేర్వేరు ఘటనల్లో..

జిల్లాలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఐదుగురు మృతి చెందారు. ఆయా గ్రామాల్లో విషాదం అలముకుంది.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	42°	25°
ఇచ్ఛాపురం	41°	25°
పలాస	41°	25°
టెక్కలి	40°	24°
పాతపట్నం	39°	24°
నరసన్నపేట	40°	24°
శ్రీకాకుళం	40°	24°



సిక్కోలు గుండెపై ప్రగతి సంతకం

- రూ.5వేల కోట్లకుపైగా పనులకు 19న సీఎం చేతులమీదుగా శంకుస్థాపనలు
- సీఎం వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారు
- సీఎం పర్యటన విజయవంతం చేయాలి
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

శ్రీకాకుళం రూరల్:

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 19న జిల్లాకు రానున్నారని, సీఎం పర్యటనను పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన సీఎం పర్యటన సమాయత్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న భావనపాడు పోర్టు శంకుస్థాపన కార్యక్రమం ఉందని, అనంతరం నౌపడ జంక్షన్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ పోర్టును జిల్లాకు తలమానికంగా తయారు చేయనున్నట్లు తెలిపారు. అలాగే రూ.176 కోట్లతో గొట్టా బ్యారేజీ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపనతో పాటు బుడగట్లపాలెంలో గల ఫిషింగ్ హార్బర్‌కు రూ.366 కోట్లతో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

- స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేద్దామన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంతో పల్లెల్లోను, పట్టణాల్లో మరింత గ్రాఫ్ పెరిగిందన్నారు.
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ భావనపాడు పోర్టు నిర్మాణంతో జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఇప్పటికే ఇచ్ఛాపురం మొదలుకుని రణస్థలం వరకు చాలా రూపాల్లో అభివృద్ధి జరిగిందని చెప్పారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం అయ్యాక నాగావళితో పాటు వంశధార నీటిని సద్వినియోగం చేసుకోవాలన్న సదుద్దేశంతో సాగునీటి పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు.
- పశు సంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌కు ఘనంగా స్వాగతం పలకాలన్నారు. గత ప్రభుత్వాలు ఈ జిల్లా ప్రజల ఓట్ల కోసం పబ్బం గడిపాయని, సీఎం వైఎస్ జగన్ మాత్రం తన ప్రణాళికలను చేసి చూపించడంతో జిల్లా అభివృద్ధి దిశగా వెళ్తోందన్నారు. భావనపాడుతో పాటే గొట్టా బ్యారేజ్ వద్ద ఏర్పాటు చేయనున్న ఎత్తిపోతల పథకం ద్వారా ఉద్దానం వరకూ నీరు అందిస్తామని, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు.
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమం అన్ని వర్గాల్లో ఒక వెలుగును తీసుకొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీలు మేరకు 95శాతం హామీలను పూర్తి చేశామన్నారు.
- కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ సీఎం పర్యటనను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మాటలు తప్ప పనులు చేయలేదన్నారు.

కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ ఎమ్మెల్సీ నర్తు రామారావు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు బల్లాడ హేమమాలిని, మామిడి శ్రీకాంత్, సూరిబాబు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పిరియా సాయిరాజ్, డీవీజీ శంకరరావు, నాయుడు బాబు, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యేలు కృష్ణదాస్, కిరణ్‌కుమార్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: బొత్స



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: అధికారులంతా సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధికలతో కలిసి ఆయన అధికారులతో సమీక్షించారు. మూలపేటలో భావనపాడు పోర్టుకు 19న శంకుస్థాపన జరుగుతుందని, అక్కడే పైలాన్ ఆవిష్కరణ, భూమి పూజ ఉంటాయని, అనంతరం మూలపేట రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం ఉంటుందన్నారు. అక్కడి నుంచి బయల్దేరి ముఖ్యమంత్రి నౌపడ చేరుకుంటారని, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. ప్రధాన వేదిక వెలుపల టాయిలెట్లు ఏర్పాటుచేయాలని, ముఖ్యంగా మహిళల కోసం ప్రత్యేక మొబైల్ టాయి లెట్లు ఉంచాలని సూచించారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ సీఎం పర్యటన కోసం ఏ ర్పాట్లు పూర్తి చేశామని, శాఖల వారీగా అధిపతులకు విధులు కేటాయించినట్లు వివరించారు. బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్, వంశధార ఎత్తిపోతల పథకానికి వెబినార్ ద్వారా సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ సీఎం పర్యటన కోసం 1900 మంది పోలీసులను వినియోగించనున్నట్లు తెలిపారు.

ఏర్పాట్లు చకచకా

టెక్కలి: సంతబొమ్మాళి మండలం మూలపేట వద్ద భావనపాడు గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన కోసం ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రానున్న సందర్భంగా అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. సముద్ర తీరానికి ఆనుకుని మూలపేట వద్ద పైలాన్ నిర్మాణం, హెలీప్యాడ్ నిర్మాణం పనులు వేగంగా చేస్తున్నారు. వీటితో పాటు నౌపడ మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ కోసం సభా ప్రాంగణం ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. సభా ప్రాంగణానికి కొద్ది దూరంలో హెలీప్యాడ్ ఏర్పాటు చేస్తున్నారు.



నౌపడ మూడు రోడ్ల జంక్షన్ సమీపంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ కోసం సభా ప్రాంగణం ఏర్పాట్లు



గంగమ్మతల్లికి పూజలు చేసేందుకు మూలపేట సముద్రం వద్ద జరుగుతున్న పనులు

న్యూస్‌రీల్

20న ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి డాక్టర్ సాయి శ్రీనివాస్ చెప్పారు. ఎచ్చెర్ల ఐటీఐ స్కిల్ హబ్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. డాక్టర్ రెడ్డీస్‌లో ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. అప్రెంటిస్ ట్రైనీ పోస్టులకు డిప్లమా, ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమికల్ బ్రాంచ్‌లు చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. మహిళలు, పురుషులు అర్హులు కాగా, 10వ తరగతి, డిప్లమా, ఇంటర్మీడియట్, బీటెక్ అన్ని కోర్సుల్లో 60 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని, విద్యలో గ్యాప్ ఉండకూడదని తెలిపారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్సుల సెట్‌లో 20వ తేదీన 10 గంటలకు హాజరు కావాలని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 97054 98845, 97049 60160 సంప్రదించాలని చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీఓ



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి కలెక్టరేట్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎస్‌పీ మండలాల్లో పథకాలు పకడ్బందీగా అమలయ్యేలా పర్యవేక్షించాలని ఆమెకు కలెక్టర్ సూచించారు.

విద్యుత్ శాఖ డివిజనల్ డిప్యూటీ ఈఈగా రాంబాబు

అరసవల్లి: విద్యుత్ శాఖ శ్రీకాకుళం డివిజనల్ డిప్యూటీ ఈఈగా బి.రాంబాబును నియమిస్తూ ఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేసిన సునీల్‌కుమార్‌ను నర్సీపట్నం డిప్యూటీ ఈఈగా వేశారు. రాంబాబు శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

పటిష్ట బందోబస్తు



జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా టెక్కలి డివిజన్ పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 19న జిల్లాలోని మూలపేట, నౌపడలో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు, వీవీఐపీ వాహనాల పార్కింగ్, హెలీప్యాడ్, ప్రోటోకాల్, పబ్లిక్ పార్కింగ్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రత్యేక పోలీసు బలగాలతో రోడ్డు క్లియరెన్సు, రోడ్డు ఓపెనింగ్ పార్టీలు, మొబైల్ వాహనాలు, రూట్ టాప్ పోలీస్ ఫోర్సుతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వీవీఐపీ వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలు కేటాయించి, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

అరసవల్లి, శ్రీకాకుళం పీఎన్ కాలనీ: గత ప్రభుత్వం మత్స్యకారులను 'తొక్క తీస్తాం..తోలు ఒలుస్తాం..' అంటూ బెదరగొట్టిందని, కానీ ప్రస్తుత జగన్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం జిల్లాలో ఎన్నడూ లేని విధంగా భావనపాడు పోర్టు, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్లు నిర్మించడం అద్భుతమని జిల్లా మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం టౌన్‌హాల్‌లో జిల్లా మత్స్యకార సహకార సంస్థ అధ్యక్షుడు కోనాడ నర్సింగరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మత్స్యకార సంఘ ప్రతినిధులు 'థ్యాంక్యూ సీఎం సార్..' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో గత ప్రభుత్వం భృతి కింద రూ.4 వేలు ఇవ్వగా, ప్రస్తుత ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తుందన్నారు. రానున్న రోజుల్లో మత్స్యకారులు దూరప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. సీఎంకు మత్స్యకారులు ఎప్పుడూ రుణపడి ఉంటారని అన్నారు. ఈ ప్రగతిలో భాగస్వామ్యమైన మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఎచ్చెర్ల మండల కన్వీనర్ మూగి శ్రీరాములు, గ్రామ సచివాలయ కన్వీనర్ మైలపల్లి పోలీస్, న్యాయవాది మూగి గురుమూర్తి, దమ్మలవీధి సొసైటీ ప్రెసిడెంట్ సూరాడ కన్నబాబు తదితరులు ఉన్నారు.

మాటిచ్చారు..నిలబెట్టుకున్నారు

'మీ బిడ్డలకు నేను ఉన్నాను అక్కా..' ఓ సామాన్య పేదరాలితో రాష్ట్ర ముఖ్యమంత్రి అన్న మాట ఇది. ఆ ఒక్క మాట ఇద్దరు బిడ్డల ప్రాణాలకు సంజీవనిగా మారింది. ఏళ్లకు ఏళ్లు ఏడుస్తూ బతుకుతున్న ఆ కుటుంబంలో ఆశల దీపాన్ని వెలిగించింది. చిన్నారుల చికిత్స కోసం ఆస్తులు అమ్ముకుని, అప్పులు చేస్తూ అవస్థలు పడుతున్న వారికి ఓ దారిని చూపించింది. ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ మందులతో ఆకలి తీర్చుకుంటున్న పసివాళ్లకు శాశ్వత పరిష్కారాన్ని ఇచ్చింది. సికిల్ సెల్ ఎనీమియా అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న జి.సిగడాంకు చెందిన ఇద్దరు చిన్నారుల ఆపరేషన్ కోసం వైఎస్ జగన్ సర్కారు రూ.32 లక్షల నగదు విడుదల చేసింది.

- రక్తహీనత వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు సీఎం వైఎస్ జగన్ అభయహస్తం
- చికిత్స కోసం రూ.32 లక్షలు విడుదల
- హైదరాబాద్‌లోని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్సకు సర్వం సిద్ధం



చిన్నారుల పరిస్థితిని సీఎం వైఎస్ జగన్‌కు వివరిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)


జి.సిగడాం:

మండల పరిధిలోని డీఆర్ వలస గ్రామానికి చెందిన పాండ్రంగి సుబ్బలక్ష్మి, రామారావు దంపతుల కుమారులు తిరుపతిరావు(12), యశ్వంత్ (10)లు సికిల్ సెల్ ఎనీమియా అనే ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్నారు. ఈ బిడ్డల దీనస్థితిపై 'సాక్షి'లో గత ఏడాది జూన్ 29 కథనం కూడా ప్రచురితమైంది. ఇన్నాళ్లకు ఆ ఇద్దరు చిన్నారుల జబ్బు శాశ్వతంగా నయమయ్యే మార్గం కనిపించింది. గత ఏడాది ఆగస్టు 26న విశాఖకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాగా.. ఆయన వద్దకు వెళ్లిన సుబ్బలక్ష్మి, రామారావు దంపతులు బిడ్డల పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. చిన్నారులకు సాయం చేస్తానని ఆనాడే సీఎం మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఆస్పత్రిలో శస్త్ర చికిత్సకు అయ్యే ఖర్చును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

రక్తహీనతతో ఇబ్బంది..

తిరుపతిరావు, యశ్వంత్‌లు ఐదేళ్లుగా ఈ రక్తహీనత వ్యాధితో బాధ పడుతున్నారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో ఈ వ్యాధి నయమయ్యే అవకాశం ఉందని తెలియడంతో.. బోన్‌మ్యారో ఇవ్వడానికి కూడా తల్లిదండ్రులు ముందుకువచ్చారు. కానీ ఆ ఆపరేషన్‌కు చాలా డబ్బు ఖర్చు పెట్టాల్సి ఉండడంతో ముందుకు వెళ్లలేకపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో విశాఖ వెళ్లి సీఎం జగన్‌కు తమ పరిస్థితి చెప్పారు. 'మీ బిడ్డలకు నేను ఉన్నాను అక్కా..' అంటూ ఆప్యాయంగా మాట్లాడిన సీఎం.. ఒక్కో చిన్నారికి చికిత్సకు రూ.16 లక్షల చొప్పున రూ.32 లక్షలు మంజూరు చేశారు. హైదరాబాద్‌లోని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో ముందుగా పెద్ద కుమారుడికి ఆపరేషన్ చేసి ఆ తర్వాత చిన్నోడికి కూడా శస్త్ర చికిత్స చేస్తారు.

దేవుడిలా ఆదుకున్నారు..



జగనన్న మాలాంటి పేదోళ్లను చూసి తన కారు ఆపి మరీ మాతో మాట్లాడారు. మెరుగైన వైద్యం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ఇప్పుడు నా పెద్ద బాబు ఆపరేషన్ కోసం రూ.16 లక్షలు విడుదల చేశారు. దేవుడిలా సీఎం మమ్మల్ని ఆదుకున్నారు.

– పాండ్రంగి రామారావు, చిన్నారుల తండ్రి

కారు దిగి కష్టాలు తెలుసుకున్నారు..



చిన్నారుల వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. అంత డబ్బు ఎలా తీసుకురావాలో మాకు తెలియలేదు. సీఎం విశాఖ వస్తున్నారని తెలుసుకుని ఆయనను కలిశాం. చిన్నారుల ఆపరేషన్ కోసం రూ.32 లక్షలు మంజూరు చేశారు.

– కుమరాపు రమేష్ నాయుడు, ఎంపీటీసీ

ముగిసిన పది పరీక్షలు



వజ్రపుకొత్తూరు రూరల్: పది పరీక్షలు పూర్తయ్యాక అక్కుపల్లి బీచ్‌లో విద్యార్థుల ఉత్సాహం

- జిల్లాలో మాల్ ప్రాక్టీసు కేసులు నిల్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 149 కేంద్రాల్లో ఏప్రిల్ 3వ తేదీన టెన్త్ పరీక్షలు మొదలైన విషయం తెలిసిందే. పరీక్షల్లో భాగంగా శనివారం సోషల్ స్టడీస్ సబ్జెక్టుకు 28,945 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 28,789 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 156 మంది గైర్హాజరయ్యారు. ప్రధాన పరీక్షలన్నీ ప్రశాంతంగా, సాఫీగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. పరీక్షల విధుల్లో భాగస్వాములై సహకరించిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు డీఈఓ గార పగడాలమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది ఎలాంటి మాల్‌ప్రాక్టీసులు నమోదు కాలేదని విద్యాశాఖ అధికారులు ధ్రువీకరించారు. ఈ నెల 19 నుంచి శ్రీకాకుళం నగరంలోని రెండు కేంద్రాలుగా మొదలయ్యే టెన్త్ స్పాట్ వాల్యుయేషన్‌కు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

క్లుప్తంగా

పాలిసెట్ ప్రవేశపరీక్షకు ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలిసెట్–2023కు ఉచిత శిక్షణ అందించనున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య శనివారం తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే శిక్షణలో స్టడీ మెటీరియల్ సైతం ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారంతా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా..



లలితకుమారికి చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : టెక్కలి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.మల్లేశ్వరరావు విధి నిర్వహణలో ఉండగా గతేడాది రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం నుంచి ఇన్సూరెన్సు కింద రూ. 21.15 లక్షలు మంజూరు కావడంతో మల్లేశ్వరరావు భార్య ఎస్.లలితకుమారికి శనివారం ఎస్పీ జి.ఆర్.రాధిక చెక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.మణికంఠ, అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, సహాయ పరిపాలనాధికారిణి శోభారాణి, సూపరింటెండెంట్ బాలరాజు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితం నాశనం



సివిల్ జడ్జిలకు జ్ఞాపికలు అందజేస్తున్న జెమ్స్ సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: ర్యాగింగ్ రహిత కాలేజీగా జెమ్స్ వైద్య కళాశాలను తీర్చిదిద్దడం అభినందనీయమని జిల్లా కోర్టు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కె.నాగమణి అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్స్, జూనియర్స్ కలిసిమెలిసి ఉండాలన్నారు. ర్యాగింగ్ వంటి అనైతిక చర్యలకు పాల్పడి జీవితం నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో అడిషనల్ సివిల్ జడ్జి ఎం.అనూరాధ, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మిలలిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవరావు, పీజీ కోఆర్డినేటర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం



లిటరసీ కిట్లు అందజేస్తున్న వయోజన విద్యాశాఖ అధికారులు

లావేరు: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వయోజన విద్యాశాఖ ఉప సంచాలకుడు ఎం.వెంకటరమణ, సహాయ ప్రాజెక్టు అధికారి బి.బాలచందర్ అన్నారు. మండలంలోని జీజీవలసలో శనివారం అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరక్షరాస్యులకు లిటరసీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరినీ అక్షరాస్యులుగా చేయడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఎంఈఓ ఎల్.ఈశ్వరరావు, వార్డు మెంబరు ఎస్.దుర్గారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

శాంత స్వరూపిణి..స్వేచ్ఛావతి

- రేపటి నుంచి ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలు
- పదేళ్ల తర్వాత ప్రారంభమవుతున్న పండగ
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

ఇచ్ఛాపురం: శాంతిస్వరూపిణి, కోర్కెలు తీర్చే కల్పవల్లి ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు వేళయ్యింది. పదేళ్ల తర్వాత జరిగే ఈ పండగల కోసం ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటి ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, బెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు.

చారిత్రక నేపథ్యం..

29 రోజులకు తక్కువ కాకుండా నిర్వహించే ఈ ఉత్సవాలకు సుమారు 200 ఏళ్ల చరిత్ర ఉంది. పూర్వం ఈ ప్రాంతమంతా ఒడిశారాజు సురంగి రాజావారి ఆధీనంలో ఉండేవి. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం వెలసిన ప్రాంతమంతా పంట పొలాలు, తోటలు, దట్టమైన చెట్లతో నిండి చిన్నపాటి అరణ్యాన్ని తలపించేది. పదుల సంఖ్యలో ఇళ్లతో చిన్న గ్రామంగా ఉండేది. అందరూ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో గిలాయి చిన్నయ్య అనే రైతు తన పంట పొలంలో కాడెద్దుల సహాయంతో దున్నుతున్న సమయంలో నాగలిలో పొలంలో ఇరుక్కుపోయింది. ఎంత ప్రయత్నించిన బయటకి రాకపోవడంతో చుట్టుపక్కల వారికి విషయం చెప్పి నాగలి బయటికి తీయడానికి సహాయం చేయమని కోరారు. అందరూ కలిసి నాగలిని తీయడానికి ప్రయత్నిస్తుండగా ఆ ప్రాంతం నుంచి రక్తం నేలపైకి ఉబికి రావడంతో అందరూ భయాందోళనకు గురయ్యారు. అదే రోజు రాత్రి చిన్నయ్య కలలో అమ్మవారు తేజోవంతంగా కనపడి నాగలి ఇరుక్కుపోయిన ప్రాంతంలో స్వేచ్ఛావతి మాతగా ఆవిర్భవిస్తున్నానని, తనకు గుడికట్టాలని చెప్పి అంతర్ధానమైంది. మరుసటి రోజు వెళ్లి పూజలు చేసి తవ్వి చూడగా అమ్మవారు బయటపడ్డారు. అదే ప్రాంతంలో చిన్న పాకవేసి



ఆకట్టుకున్న విద్యుత్ అలంకరణ

మొదట్లో రైతు కుటుంబీకులు పూజలు చేశారు, తరువాత గిలాయి వంశీయులు పూజలు చేయడం, కాలక్రమేణా గ్రామదేవతగా ప్రసిద్ధిచెందింది. ఈ అమ్మవారి పేరుమీదనే స్వేచ్ఛాపురం గ్రామం ఏర్పడింది. కాలక్రమేణా స్వేచ్ఛాపురం కాస్త ఇచ్ఛాపురంగా రూపాంతరం చెందింది.

2013 తర్వాత మళ్లీ..

అమ్మవారి ఉత్సవాలు పూర్వం నుంచి 29 రోజులకు తక్కువ కాకుండా జరిగేవి. 1976లో ఉత్సవాలు జరిగిన తరువాత 25 ఏళ్లు నిర్వహించలేదు. 2001లో మళ్లీ ప్రారంభం కాగా, 2013లో చివరిసారిగా ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించారు.

ఉత్సవాలు జరిగే తీరు..

- ఈ నెల 17న మొదటి పూజ గిలాయి చిన్నయ్య వంశీయులచే ప్రారంభమవుతుంది. అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి ఉప్పల వీధిలో కొలువదీరుస్తారు.
- ఉత్సవాల సమయంలో నందిక వంశీయులతో పాటు వీధిలో ఉన్నవారంతాకలసి కట్టుగా ఏర్పాట్లు చూస్తుంటారు.
- మొదటి 15 రోజులు మున్సిపాలిటి పరిధిలోని 17 వార్డుల్లో తిరువీధి నిర్వహిస్తారు. ఈ సమయంలో రోజుకు 20 వేల మంది భక్తులు పాల్గొంటారని అంచనా.
- 15 రోజుల తర్వాత రథం వీధి, దాసన్న పేట కూడలిలో భక్తుల దర్శనార్థం ప్రత్యేక మండపంలో అమ్మవారిని ఉంచుతారు. ఈ సమయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజుకు 80వేల మంది పాల్గొనే అవకాశముంది.
- ఉత్సవాలు జరిగే సమయంలో ప్రతి మంగళ, శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- మే 1 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.
- మే 15తో వేడుకలు ముగుస్తాయి.
- ఏవైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, పాదయాత్రలు, ప్రారంభం లేక ముగింపు వంటి కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.
- మాలీలు(అర్చకులు) ఇచ్చిన సమాచారం మేరకు అమ్మవారు మొత్తం ఐదుగురు అక్కాచెల్లెళ్లు. కురాసిని, స్వేచ్ఛావతి, గారపోలమ్మ, సిద్ధభైరవి, ముత్యాలమ్మ. అందరూ ఉగ్రరూపంలో ఉన్నా స్వేచ్ఛావతి అమ్మవారు మాత్రం శాంతమూర్తి కావడంతో ఇక్కడ పూజలు చేస్తే ప్రశాంతత, విజయం చేకూరుతుందని భక్తుల నమ్మకం.
- 2019లో అమ్మవారి మూలవిరాట్‌గా కృష్ణశిలావిగ్రహాన్ని పునఃప్రతిష్ఠాపన చేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు.



స్వేచ్ఛావతి అమ్మవారు



ఉత్సవాలకు సిద్ధమైన ఆలయం

పకడ్బందీగా ఏర్పాట్లు..



స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి నిత్యం వార్డుల్లో శానిటేషన్ పనులు చేసేందుకు సిబ్బందిని షిఫ్టుల రూపంలో నియమించాం. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పిలక రాజలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్

ఉత్సవాలకు ఆహ్వానం



స్పీకర్ తమ్మినేనికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు హాజరుకావాలని కమిటీ ప్రతినిధులు శనివారం స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌కు ఆహ్వాన పత్రికలు అందజేశారు. శ్రీకాకుళంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్కలోకేశ్వరరావు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అన్వేష్, నాయకులు ప్రకాశపట్నాయక్ పాల్గొన్నారు.

చిత్రకారిణి ప్రమీళారాణికి సత్కారం



సీఎం జగన్ చిత్రాన్ని కృష్ణదాస్‌కు అందిస్తున్న ప్రమీళారాణి

పోలాకి: భావనపాడు పోర్టుకు శంకుస్థాపన చేయనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రకాశరావుపేటకు చెందిన చిత్రకారిణి సంపతిరావు ప్రమీళారాణి ముఖ్యమంత్రి స్కెచ్‌ను అద్భుతంగా గీసింది. ఈ చిత్రాన్ని గీచి వరల్డ్ ఆర్టిస్ట్‌డే సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు శనివారం మబగాంలోకి ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేసింది. ఈ సందర్భంగా ప్రమీళారాణిని సన్మానించారు. జిల్లాకు వస్తున్న సీఎంకు చిత్రాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రమీళారాణి 2023 ఇండియన్ ఐకాన్–యంగ్ స్కెచ్ అవార్డును సైతం దక్కించుకుంది.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,040–00
బంగారం(22సి. 10గ్రా.)	55,950–00
వెండి (కిలో)	81,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204

విద్యా ప్రమాణాలు పెరగాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, సంస్థల నుంచి పోటీ తట్టుకోవాలంటే ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు అమలు చేయాలని ఉన్నత విద్యా మండలి పూర్వపు చైర్మన్, ఏయూ పూర్వపు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎల్.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని అంబేడ్కర్ వర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో శనివారం మేనేజ్‌మెంట్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సు రిలీవ్ అయ్యే నాటికి శతశాతం విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలే విద్యలో మార్పులు అవసరమని చెప్పారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, విషయ పరిజ్ఞానం, పారిశ్రామిక అవసరాలకు అనువైన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇన్‌టర్న్‌షిప్ వంటివి అమలు చేయటం వల్ల నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ



వేణుగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఉపాధికి తగ్గ కోర్సులు నిర్వహణ, సిలబస్ మార్పు వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య, హానరీ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కూన అచ్యుతరావు పాల్గొన్నారు.

ప్రయాణికుడికి పర్సు అందజేత

శ్రీకాకుళం అర్బన్: పార్వతీపురం జిల్లా గరుగుబిల్లి గ్రామానికి చెందిన పి.శంకరరావు శనివారం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులో పాలకొండ నుంచి శ్రీకాకుళం వరకు ప్రయాణించాడు. ఈ సమయంలో పర్సును బస్సులో జారవిడుచుకున్నాడు. సర్వీసు కండక్టర్ ఆనందరావుకు పర్సు దొరకడంతో శ్రీకాకుళం రెండో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మకు అప్పగించారు. పర్సులో 6 కార్డులు, రూ.1200 నగదు ఉన్నాయి. ఆధార్ కార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా శంకరరావుకు విషయం తెలియజేయగా శనివారం మధ్యాహ్నం కాంప్లెక్స్‌కు వచ్చి పర్సు తీసుకున్నాడు.



శంకరరావుకు పర్సు అందజేస్తున్న సిబ్బంది

కార్యక్రమంలో ఆర్టీసీ భద్రత–నిఘా విభాగ అధిపతి సూరప్పడు, డిపో అసిస్టెంట్ మేనేజర్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు రగ్బీ జిల్లా జట్ల ఎంపికలు

టెక్కలి: జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బాలురు, బాలికల జూనియర్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు వారణాసి గోవిందరాజు, పొన్నాడ పార్వతీశం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 నుంచి 2007 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



బైరయ్య(ఫైల్)

ఇచ్ఛాపురం: జాతీయ రహదారి–16పై బెల్లుపడ – ఈదుపురం కూడలిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లుపడ గ్రామానికి చెందిన తిప్పన బైరయ్య(33) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెల్లుపడ అనపాన వీధికి చెందిన తిప్పన బైరయ్య నెల్లూరులో వెల్డింగ్ పనులు చేసేవాడు. గ్రామదేవత ఉత్సవాల కోసం స్వగ్రామం వచ్చాడు. బంధువులకు ఆహ్వానం పలికేందుకు ఈదుపురం బైకుపై వెళ్లి తిరిగి వస్తుండగా పలాస వైపు నుంచి బరంపురం వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని తండ్రి మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


ద్విచక్ర వాహనం బోల్తాపడి..

జలుమూరు : రావిపాడు సమీపంలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం బోల్తా పడిన ఘటనలో అదే గ్రామానికి చెందిన సాగి దాలప్పడు (78) శుక్రవారం రాత్రి రిమ్స్‌లో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వైద్య పరీక్షలు చేసుకునేందుకు కుమారుడు శ్రీనివాసరావుతో కలిసి నరసన్నపేట వెళ్లి తిరుగు వస్తున్న క్రమంలో రోడ్డు మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో దాలప్పడు తలకు బలమైన గాయమైంది. వెంటనే 108లో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు పోలీస్‌లు తెలిపారు. అల్లుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

లావేరు: రావివలస సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఎం.రవీంద్రన్ పిళ్లా(52) అనే వ్యక్తి మృతి చెందాడు. లావేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామానికి చెందిన రవీంద్రన్ పిళ్లా పని నిమిత్తం రణస్థలం వచ్చాడు. శుక్రవారం రాత్రి రావివలస వైపు నుంచి రణస్థలం వైపు జాతీయ రహదారి పక్కన నడుచుకొని వెళుతుండగా శ్రీకాకుళం నుంచి రణస్థలం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడటంతో 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ భుజంగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల కొట్లాటలో వ్యక్తి మృతి



మృతుడు సింహాద్రి

సరుబుజ్జిలి: మండలంలోని మూలసవలాపురంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కరాపాటి సింహాద్రి(55), బంధువులకు మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఇరువర్గాల మధ్య మాటామాట పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ క్రమంలో గొల్లపల్లి లక్ష్మి కర్రతో సింహాద్రి తలపై బలంగా కొట్టింది. మరో ఇద్దరు కూడా తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడిన సింహాద్రిని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి భార్య అప్పలనరసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొల్లపల్లి లక్ష్మి, కుప్పిలి రాజేశ్వరి, కుప్పిలి భాస్కరరావులపై కేసు నమోదు చేశామని ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ తెలిపారు. పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే అరెస్ట్ చేసి కోర్టుకు అప్పగిస్తామని చెప్పారు

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

నరసన్నపేట: జాతీయ రహదారిపై దేవాది ఫ్లై ఓవరు వంతెన వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. దేవాది పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్ వేయించుకొని రాంగ్ రూట్లో శ్రీకాకుళం వైపు ద్విచక్ర వాహనంతో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మినీ లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. జలుమూరు మండలం పర్లాంకు చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుని వద్ద ఫోను, ఇతర వివరాలు లేకపోవడంతో పూర్తి సమాచారం తెలియడం లేదు. ప్రమాదంలో ఉన్న ద్విచక్ర వాహనం నంబర్ ప్రకారం ఆన్‌లైన్లో చూస్తే ఉమామహేశ్వరరావు అని వస్తోంది. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎన్‌హెచ్



ఘటనా స్థలంలో మృతదేహం

అంబులెన్స్ సిబ్బంది, పెట్రోలింగ్ పోలీసులు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నరసన్నపేట ఎస్‌ఐ వై. సింహాచలం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.